విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 18 జూన్ 2024 8 పేజీలు

హామీలన్నీ గుర్తున్నాయి..నెరవేరుస్తాం

- పాలన గాడిలో పడాలి
- వెలుగొండ ప్రాజెక్టు బాబు పూర్తి చేస్తారు
- మార్కాపురం జిల్లా ఏర్పాటు ఖాయం
- కక్ష సాధింపు రాజకీయాలు ఉండవు
- సమన్వయంతోనే ముందుకు
- మంత్రి స్వామి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : గత ప్రభుత్వంలో అరాచకాన్ని అవినీతిని చూశాం. ప్రజలకు అవసరమేంటో వారి ఆలోచన ఏమిటో దానికనుగుణంగా రాష్ట్ర అభివృద్ధికి ఏం కావాలో వాటి అమలుపై ఎన్నికల్లో స్పష్టమైన హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోను విడుదల చేశాం. ఆ మేరకు ప్రతి ఒక్కటి అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగానే ఉంది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఏ హామీని విస్మరించము. ఇది ప్రజా ప్రభుత్వం. ప్రజలచేత మన్ననలు పొందడమే మా ముందున్న లక్ష్యం అంటూ ఇటీవల సాంఘిక సంక్షేమ శాఖ దివ్యాంగులు, సచివాలయం, వలంటరీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన డోలా బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు. సోమవారం టంగుటూరు మండలం నాయుడుపాలెంలోని ఆయన నివాసంలో ఆయనను కలిసిన విలేకరులతో ఆయన ముచ్చటించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. అదే క్రమంలో జిల్లాలో ప్రప్రథమంగా పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు సాగు, త్రాగునీరు అందించడంతో పాటు మార్కాపురాన్ని జిల్లా కేంద్రంగా చేయడం అద్దంకి, కందుకూరు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో విలీనం చేయడం వంటి హామీలను అమలు చేస్తాం. వాటిని విస్మరించం. ప్రతి ఒక్క హామీ మాకు గుర్తుంది. ముందు పాలన గాడిలో పడాలి. చాలా మంది అధికారులు ఇంకా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. అధికారుల్లో మార్పులు రావాలి. వారిని గాడిలో పెట్టాలి. రాష్ట్రంలో సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నా. రెండు మూడు నెలల్లో అన్ని సర్దుకుంటాయి. వెనువెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. పలు శాఖా పరమైన అంశాలపై కూడా ఆయన చర్చించారు. సాంఘిక సంక్షేమ శాఖల్లో ముఖ్యంగా హాస్టల్స్‌లో అనేక సమస్యలు ఉన్నాయి. కోట్ల రూపాయలు బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం హాస్టల్లో చేరే పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టే పరిస్థితి కన్పించడం లేదు. మరుగుదొడ్లకు తలుపులు కూడా లేవు. ఇప్పుడిప్పుడే అధికారులతో సమీక్షిస్తున్నా. తక్షణమే పిల్లలకు అవసరమైన కనీస సౌకర్యాలపై దృష్టి పెట్టాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టళ్లలో పిల్లలను చేర్పిస్తున్నారని వారి నమ్మకాన్ని మనం వమ్ము చేయకూడదని తెలిపారు. దీనిలో ఎక్కడా రాజీ పడమని స్పష్టం చేశారు. సచివాలయ మిగతా 2 లో...

వైసీపీకి మాజీ మంత్రి గుడ్‌బై

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఘోర పరాభవాన్ని చవి చూసింది. దీంతో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు ఆ పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీలో చేరబోతున్నట్లు ప్రకటించలేదు. కొంతకాలం ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉండనున్నట్లు తన అనుచరులు తెలుపుతున్నారు. వివరాల్లోకి వెళితే శిద్దా రాఘవరావు రాజకీయ జీవిత ప్రస్థానం తెలుగుదేశం పార్టీతో ప్రారంభమైంది. ఒంగోలు నియోజకవర్గం నుంచి ఒకసారి పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవి కట్టబెట్టారు. ఆ తరువాత మరలా ఒంగోలు నుంచి బరిలోకి దిగి ఓటమి చెందారు. అయినప్పటికీ శిద్దా రాఘవరావుకు ఎంఎల్‌సి టిక్కెట్టు ఇచ్చి ప్రోత్సహించింది. 2014లో మరోసారి దర్శి నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో శిద్దా విజయం సాధించారు. దీంతో శిద్దా వైశ్య సామాజికవర్గం కావడంతో శిద్దా రాఘవరావును చంద్రబాబు నాయుడు తన మంత్రివర్గంలోకి తీసుకొని రోడ్లు, రవాణా శాఖ పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖా మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. 2014 నుంచి 2019 వరకు శిద్దా రాఘవరావు తెలుగుదేశం పార్టీ హయాంలో మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికల్లో శిద్దా ఒంగోలు మిగతా 2 లో...

రైతు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం 3 లో..

రెవెన్యూ మంత్రి 'అనగాని'కి అపూర్వ స్వాగతం

బైక్ ర్యాలీలు, డప్పు వాయిదాలతో, బాణాసంచా పేల్చుతూ కూటమి శ్రేణులు ఘన స్వాగతం

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొట్టమొదటిసారిగా రేపల్లె పట్టణానికి విచ్చేసిన సందర్భంగా అనగాని సత్యప్రసాద్‌కు జనసేన, బిజెపి, టీడీపీ కూటమి శ్రేణులు కార్యకర్తలు, నాయకులు సోమవారం సాయంత్రం అపూర్వ స్వాగతం పలికారు. పెనుమూడి చెక్‌పోస్ట్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ఓల్డ్ టౌన్ అంకమ్మ చెట్టు నుండి రింగ్ రోడ్ మీదుగా కృష్ణ టాకీస్,తాలూకా ఆఫీస్, రైల్వే స్టేషన్, వద్దగల ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. అంబేద్కర్ ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి మంత్రి అనగాని నివాళులర్పించారు. అక్కడి నుండి మున్సిపల్ ఆఫీస్,బస్టాండ్,లక్ష్మీ టాకీస్ సెంటర్ మీదుగా టీడీపీ కార్యాలయానికి పెద్ద ఎత్తున ర్యాలీ జరిగింది.ఎక్కువ సంఖ్యలో రేపల్లె నియోజకవర్గం నుండి కూటమి శ్రేణులు మిగతా 2 లో...

భద్రత చూపలేని ప్రైవేటు స్కూళ్లు

- ఇరుకు గదులు అపార్ట్‌మెంట్స్‌లో తరగతులు నిర్వహణ
- ప్రమాదం జరిగితే తప్పదు భారీ మూల్యం
- అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు
- బుక్స్, యూనిఫాం పేరుతో భారీ దోపిడి
- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- మచ్చుకైన కనిపించని ఆటస్థలాలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారింది. విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడం తనిఖీ చేయకపోవటంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి రూ. వేలకు వేలు ఫీజులు దండుకునేందుకునే ప్రాధాన్యం ఇస్తున్నారే గానీ మౌలిక వసతులను కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ఇరుకు గదుల్లో నిబంధనలు విరుద్ధంగా విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. విద్యార్థులకు పాఠశాలల్లో ఆటపాటలటుంచితే మలమూత్రశాలలు కూడా ప్రశాంతంగా ఉండని పరిస్థితి దాపురించింది. అపార్టుమెంట్లలో తరగతి నిర్వహిస్తుండటంతో లిఫ్టు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతూ బడికి వెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. వీటిలో అధికశాతం పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకొని ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఏదైనా సమస్య రానంత వరకూ బాగానే సాగుతుంది కానీ పొరపాటున జరగరాని ప్రమాదం జరిగితే మాత్రం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని విద్యావేత్తలు,విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- నిబంధనలు గాలికి..

ప్రతి పాఠశాల ఏర్పాటుకు ముందు అగ్నిమాపకశాఖ నుంచి ఫైర్ సర్టిఫికేట్ పొందాలి. సంబంధిత శాఖ అధికారులు భవనం అనుకూలతను పరిశీలించి అనువుగా ఉంటేనే వాటిని ధ్రువీకరణకు అనుమతులిస్తారు. కానీ రాజకీయ ఒత్తిళ్లు మిగతా 2 లో...

మంత్రి, ఎంపీని కలిసిన ఏపీయూడబ్ల్యుజే ప్రతినిధి బృందం

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రంలో కొత్తగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన డోలా బాల వీరాంజనేయస్వామితో పాటు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని అదే విధంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తెలుగు యువత నాయకులు దామచర్ల సత్యను సోమవారం వారివారి నివాసాల్లో ఏపీయూడబ్ల్యుజే ప్రతినిధి బృందం కలిసి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్లు, హెల్త్ ఇన్సరెన్స్, ఎక్సడెంటల్ ఇన్సురెన్స్ పాలసీ పునరుద్ధరణకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల పాసులను పునరుద్ధరించాలని ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డిని కోరగా ఇదే అంశాన్ని పార్లమెంట్‌లో తప్పకుండా ప్రస్తావించి సంబంధిత రైల్వేశాఖ మంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు రైల్వే ప్రయాణంలో 50 శాతం రాయితీని పున:ప్రారంభించే విధంగా తనవంతు కృషి చేస్తానని ఎంపీ మాగుంట జర్నలిస్టులకు హామీ ఇచ్చారు. అదే విధంగా జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టులకు అండగా ఉంటానని సత్య హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అలుగుల సురేష్, సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి దాసరి కనకయ్య, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు సురేష్ కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు బి.వెంకటరావు, శ్రీనివాసరావు, శంకర్, జయరావు, సర్వేశ్వరరావు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

రెవెన్యూ మంత్రి 'అనగాని'కి అపూర్వ స్వాగతం

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు కార్యకర్తలు,అభిమానులు,మంత్రి సత్యప్రసాద్‌కు అపూర్వ స్వాగతం పలికారు.నియోజకవర్గ ప్రజలందరికీ టాప్ లేని జీబుపైనుండి మంత్రి అనగాని అభివాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. జిందాబాద్ అనగాని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నాయకత్వం వర్థిల్లాలంటూ పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు అభిమానులు నినాదాలు ఇస్తూ ర్యాలీ జన ప్రభంజనంలా సాగింది. జనసేన, బీజేపి, టీడీపీ ఉమ్మడి జెండాలు ద్విచక్ర వాహనాలపై పెట్టుకుని ర్యాలీగా టీడీపీ కార్యాలయం వరకు సాగింది.మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా రేపల్లె పట్టణానికి విచ్చేసిన రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అపూర్వ స్వాగతం ప్రజలు పలికారు. ఈ సందర్భంగా పూలదండలు శాలువాలతో మంత్రి సత్యప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు అనగాని శివప్రసాద్, జి.శ్రీనివాసరావు పంతాని మురళీధర్‌రావు,గోగినేని పట్టాభిరామారావు, వెంకటేశ్వరరావు, ఆలూరు దానియేల్, పంతాని సాయికుమార్, మద్దుల అంకాలు, తెలుగు మహిళ నాయకులు జయప్రద, లక్ష్మీనరసమ్మ, నాగశ్రీ, వై.శ్రీలక్ష్మి,జనసేన పట్టణ అధ్యక్షులు రానంశెట్టి మహేష్, దేవగిరి శంకర్ సాయి, బిజెపి నాయకులు అన్నం సాయి వరప్రసాద్,గుమ్మడి సాంబశివరావు, బేతపూడి వెంకటేశ్వరరావు, బోయిన ఉయ్యారు, నియోజకవర్గంలోని వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని మంత్రికి స్వాగతం పలికారు.

అన్నా క్యాంటీన్‌ల వద్ద అన్నదానం

- ఒంగోలులో త్వరలో నాలుగు అన్న క్యాంటిన్ల ద్వారా పేదలకు ఆహారం
- పేదోడు కడుపు నింపేది టీడీపీనే
- త్వరలో రూ.5కే అన్న క్యాంటీన్ ద్వారా పేదోడికి అన్నం
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

విశాలాంధ్ర - ఒంగోలు : అబ్బూరి వెంకట్రావు ఆధ్వర్యంలో ఒంగోలులోని నాలుగు అన్న క్యాంటీన్‌ల వద్ద సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదానం కార్యక్రమాలను ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌లు ప్రారంభించారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక ట్రంకు రోడ్‌లోని శ్రీకృష్ణుని ఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కర్నూల్ రోడ్‌లోని అన్న క్యాంటీన్ వద్ద, కూరగాయల మార్కెట్‌లోని అన్న క్యాంటీన్ వద్ద, కొత్తపట్నం బస్టాండ్ వద్ద గల అన్న క్యాంటీన్ వద్ద, కలెక్టర్ కార్యాలయం సమీపంలోని అన్న క్యాంటీల వద్ద అన్నదానము కార్యక్రమాలను దామచర్ల జనార్దన్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా దామచర్ల మాట్లాడుతూ ఎన్నికల హామీలలో భాగంగా కేవలం ఐదు రూపాయలకే పేదవాడికి అన్నం దక్కేలా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన వెంటనే సంతకం చేశారన్నారు. 2014 నుండి 2019 వరకు పేదవాడికి అన్నానికి ఇబ్బంది లేకుండా చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తే 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ కక్ష పూరితంగా అన్నా క్యాంటీన్ లను తొలగించి పేదోడి కడుపు కొట్టారన్నారు. గత ఎన్నికలలో పెత్తందారులకు పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధం అంటూ ప్రచారాన్ని నిర్వహించిన జగన్ కు పేదలు ఓటు అన్న ఆయుధంతో తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపారు అన్నారు. పేదలకు ఇచ్చిన హామీల్లో భాగంగా ఒంగోలులో త్వరలో 4 సెంటర్లలో అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కె ఆహారం అందిస్తామని హామీ ఇచ్చారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ మాట్లాడుతూ పేదల పక్షాన ఎల్లప్పుడూ నిలిచేది తెలుగుదేశం,జనసేన, బిజెపి పార్టీ లేనని ప్రజలు గుర్తించి తమకు అధికారం కట్ట పెట్టారన్నారు. రానున్న కాలంలో ఒంగోలు నియోజక వర్గంలో దామచర్ల జనార్ధన్ రావు,రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఆకాంక్షించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించిన అబ్బూరి ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీకి మాజీ మంత్రి గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

పార్లమెంట్ నుండి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో శిద్దా రాఘవరావు ఓటమి చెందారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారాన్ని కోల్పోయి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీంతో శిద్దా రాఘవరావు కొన్ని నెలలు తెలుగుదేశంలో ఉండి తదనంతరం తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నుండి దర్శి ఎమ్మెల్యే టిక్కెట్టు ఆశించారు. అయితే జగన్మోహన్‌రెడ్డి ఆ సీటును బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ఇచ్చారు. ఆ క్రమంలో శిద్దాను ఒంగోలు అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని జగన్మోహన్‌రెడ్డి సూచించారు. శిద్దా రాఘవరావు దర్శి నుంచి తప్ప మరో నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి కనపరచలేదు. దీంతో తెలుగుదేశంలో అవకాశం కల్పిస్తే దర్శి నుంచి పోటీ చేసేందుకు శిద్దా రాఘవరావు సిద్ధపడ్డారు. చంద్రబాబు కూడా దర్శి టిక్కెట్టు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. అదే సమయంలో శిద్దా రాఘవరావు ఇంట్లో విషాదం చోటు చేసుకుంది. దీంతో శిద్దా రాఘవరావును ఒంగోలు ఎంపీగా వైసీపీ తరపున పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శిద్దాను ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లారు. ఉంటే వైసీపీలో ఉండే లేదా తెలుగుదేశం పార్టీలో చేరి ఎక్కడో చోట పోటీ చేస్తే నీ ఇష్టం మళ్లీ వచ్చేది మా ప్రభుత్వమే ఆ తరువాత నీ పరిస్థితి ఏంటో అర్ధం చేసుకో అని సున్నితంగా హెచ్చరించినట్లు అప్పటిలో ప్రచారం జరిగింది. దీంతో రాఘవరావు టీడీపీలో చేరేందుకు వెనుకడుగు వేశారు. తదనంతరం తెలుగుదేశం దర్శి ఎమ్మెల్యే టిక్కెట్టును గొట్టిపాటి లక్ష్మికి ఇచ్చి ప్రోత్సహించారు. దీంతో రాఘవరావు వైసీపీలోనే ఉండి పోయారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయలేదు. మరలా వైసీపీ ప్రభుత్వం వస్తే ఏదో ఒక ఎంఎల్‌సినో లేద రాజకీయ పదవి వచ్చిద్దని ఆశించారు. గడిచిన ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాభవాన్ని మూట కట్టుకోవడంతో చేసేది ఏమీ లేక సోమవారం శిద్దా రాఘవరావు వైసీపీకి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి రాజీనామా లేఖను జగన్మోహన్‌రెడ్డికి పంపించారు.

హామీలన్నీ గుర్తున్నాయి..నెరవేరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థ ద్వారా పనిచేయిస్తామని పునరుద్ఘాటించారు. వచ్చే నెల 1వ తేది పెన్షన్‌ను ఏడు వేల రూపాయలు ప్రతి ఒక్కరికి అందజేస్తామని, పంపిణీలో ఎక్కడ ఎలాంటి అవకతవకలు లేకుండా చూసుకుంటామని పేర్కొన్నారు. అయితే ఒకేసారి ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన మూడు వేల రూపాయలు కొత్తగా ఇస్తున్న నాలుగు వేల రూపాయలు మొత్తం కలిపి ఏడు వేల రూపాయలు ఇవ్వడం గొప్పవిషయమని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 1వ తేదీన పెన్షన్ పంపిణీకి రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలో పనిచేసే వలంటరీలు ఎన్నికల సమయంలో రాజీనామా చేశారని తెలిపారు. మరికొన్ని రాజీనామా పత్రాలను ఆమోదించకుండా పెండింగ్‌లో ఉంచారని తెలిపారు. ఎందుకని ప్రశ్నిస్తే వలంటీర్లు సెల్‌ఫోన్, సిమ్‌కార్డు తమకు అందజేయలేదని వాటిని పెండింగ్‌లో పెట్టినట్లు సమాధానం తెలుపుతున్నారన్నారు. ఏదేమైనా ఒకసారి వలంటీర్ రాజీనామా చేస్తే మరలా తీసుకోవడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. సచివాలయం వలంటీర్ వ్యవస్థ చేత ఎలా పనిచేయించుకోవాలో మరోసారి ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించి ప్రజలకు ఎక్కడ అసౌకర్యం, ఇబ్బంది కల్పించకుండా ప్రజాపాలన అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి జిల్లాలోని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు నాయకులతో సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధితో పాటు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

భద్రత చూపలేని ప్రైవేటు స్కూళ్లు

(మొదటిపేజీ తరువాయి)

పలుకుబడితో అటు,ఇటుగా ఉన్నా అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక రెన్యువల్ సమయంలో కూడా కేవలం పేపర్ల ఆధారంగానే సర్టిఫై చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు దండుకునే విషయంలో ఉన్నంత శ్రద్ధ వారికి మౌలిక వసతులను కల్పించడంలో లేదనే చెప్పాలి. ప్రైవేటు ,కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యకు మినహా ఆటలకు, విద్యార్థుల భద్రతకు ఏమాత్రం ప్రాధాన్యం ఇవ్వడం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయి. అపార్టుమెంట్లు, ఇరుకు గదుల్లో తరగతులను నిర్వహిస్తూ విద్యార్థుల భద్రతను గాలిలో దీపంలాగా ఉంచుతున్నారు. జిల్లాలో ఎక్కువ శాతం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలను ఇరుకు గదులు, వ్యాపార సంస్థలు, అపార్టుమెంట్లలో నడుపుతున్నారు. వీటిలో అధికశాతం పరిమితికి మించి విద్యార్థులను చేర్చుకొని ఇరుకు గదుల్లోనే తరగతులను నిర్వహిస్తున్నారు.

- కనీస వసతులు కరువు

జిల్లాలో కొన్ని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు దండుకుంటున్నా వారికి కావాల్సిన కనీస మౌలిక వసతులను కల్పించడం లేదనే విమర్శలు మెండుగా ఉన్నాయి. విద్యార్థులకు తాగేందుకు సరిపడా మంచినీటిని కూడా అందుబాటులో ఉంచడం లేదనే విమర్శలున్నాయి.విద్యార్థులు మంచి నీటిని బాటిల్లలో ఇంటి నుంచే తీసుకుపోతున్నారు. వీటితోపాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు గానీ మూత్రశాలలు కానీ ఉండటం లేక పోవడంతో విద్యార్థులు స్కూలు సమీపంలో బహిరంగ ప్రదేశాల్లోమూత్ర విసర్జనలు చేస్తున్నారు. సహజంగా విద్యార్థులు బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేసేందుకు ఇబ్బందిగా భావించి అలాగే నిలుపుకొని అనారోగ్యానికి గురవుతున్నారు.

- తనిఖీలు మరిచిన విద్యాశాఖ అధికారులు

జిల్లాలో విద్యాశాఖ అధికారులు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను తనిఖీలు చేయడం మరిచారని జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కూడా కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తు, భద్రతను దృష్టిలో ఉంచుకొని జిల్లా విద్యాశాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని స్కూళ్లపై కొరడా ఝులిపించాలని విద్యావేత్తలు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సుజనా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన 'దారపనేని'

విశాలాంధ్ర-పామూరు : విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వై సుజనా చౌదరిని సోమవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో సైకో పాలన అంతమొందించడానికి రాష్ట్ర ప్రజలందరూ కలిసికట్టుగా కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, ఇది ప్రజా విజయమని, రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టించగల సత్తా ఉన్న నాయకుడిని ఎన్నుకున్నారని దారపనేని పేర్కొన్నారు. సుజనా చౌదరిని అభినందించిన వారిలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య, చెనికల చిన్న మాల కొండయ్య, చిన్న కొండారెడ్డి ఉన్నారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే 'ఉగ్ర' ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి గార్లపేట రోడ్డులోని దొంతులమ్మ ఆలయంలో కొలువైన శ్రీ ఉమామహేశ్వర స్వామి, కొండ కింద కొలువైన శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. దొంతులమ్మ ఆలయంలో కనిగిరి కాపునాడు సంగం ఆధ్వర్యంలో పూజలు చేయగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామికి సున్న కృష్ణ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు, వేద పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యే ఉగ్రకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు టంగుటూరి గోవిందరావు, అధ్యక్షులు డాక్టర్ ఆర్ రామయ్య నాయుడు, ప్రధాన కార్యదర్శి ముండ్లమూరి మాల కొండయ్య, కోశాధికారి కేబీపీ సుబ్బారావు, కార్యవర్గం వాకమల్ల కిషోర్, పి నారాయణ, బ్రహ్మయ్య, జెడ్ తిరుపతిరెడ్డి, ఐ.వి.సుబ్బారావు, కదిరి ప్రసాద్, కొలివర్తి మారుతి కుమార్, ఓలేటి చిన్న, కొట్టే ప్రసాద్‌తో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈద్గాలో బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన 'ఉగ్ర'

విశాలాంధ్ర-కనిగిరి : బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ముస్లిం సోదరులతో పాటు ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఈద్గాలో ప్రత్యేక నమాజు చేసి ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.త్యాగానికి ప్రత్యేకగా నిలిచిన బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఆనందంగా జరుపుకోవాలని కోరారు. అల్లా దయవల్ల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు యువత కనిగిరి పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, మైనార్టీ నాయకుడు గుడిపాటి ఖాదర్, షేక్ అహ్మద్, షేక్ నజుముద్దీన్, షేక్ ఇలియాజ్, షేక్ జిలాని (పులి), షేక్ యాసిన్ ,మున్నా రహీం, ఖాజా, రబ్బానీ, షాహుల్ , బాబు, ముత్తు, రసూల్, మన్సూర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : 1936 ఏప్రిల్ 11న ఆవిర్భవించిన రైతు సంఘం (ఏఐకేఎస్) స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడమే కాక జమీందారీ, భూస్వామ్య, జాగిర్దారి విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిందని, అనేక పోరాటాల ద్వారా రైతు సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే వీరారెడ్డి తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గ రైతు సంఘ సమితి సమావేశం బేస్తవారిపేటలో ఆ సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఢాకాల పుల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా వీరారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలను 90% సబ్సిడీతో రైతులకు వెంటనే సరఫరా చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి, రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ చట్టం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఢాకాల పుల్లయ్య మాట్లాడుతూ 50 ఏళ్ళు దాటిన రైతులకు రూ. 10,000 లు పింఛన్ మంజూరు చేయాలని, తెలంగాణలో రైతులకు ఇచ్చిన విధంగా రైతు భరోసా నిధులు కేటాయించాలని, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసి, వెలుగొండ ప్రాజెక్టుకు నికరజలాలు విడుదల చేసి, నిర్వాసితులకు సహకరించాలని, కంభం చెరువు కింద కాలువలకు పూడికలు తీయించాలని, నియోజకవర్గం పరిధిలోని చెరువులు మరమ్మతులు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుగా అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శి అతుల్ కుమార్ అంజన్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరుమార్పు జోసఫ్, రైతు సంఘం అధ్యక్షులు జక్కా అంకయ్య, కంభం మండల నాయకులు వేల్పుల అంకయ్య, మోక్షగుండం రైతు సంఘం నాయకులు టి. రంగారెడ్డి ఎం. కొండయ్య పాల్గొన్నారు.

అల్లాహ్ బోధనలు అనుసరణీయం

- ఉత్సాహంగా బక్రీద్
- ప్రత్యేక నమాజ్ చేసిన ముస్లింలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు మండల వ్యాప్తంగా సోమవారం ప్రత్యేక నమాజు చేశారు. చిన్నా పెద్ద తారతమ్యంలేకుండా సాంప్రదాయ దుస్తులు ధరించి, అత్తరు గుబాలింపులతో మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఉల్లగల్లు గ్రామ శివారు అద్దంకి దర్శి ఆర్ అండ్ బి రోడ్డు వెంబడి ఉన్న ఉమామహేశ్వరపురంలోని గ్రామ చివర ఉన్న చెరువు కట్ట వద్ద ఈద్గా ల వద్ద ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ప్రార్థనలునిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్ద హాఫీజ్ మాట్లాడుతూ ప్రవక్త ఆయన తనయుడు ఇస్మాయిల్ ప్రవక్తల త్యాగ నిరతిని ప్రతి ఒక్క ముస్లిం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇస్లాం మత సూత్రాలను జీవితంలో కచ్చితంగా పాటించిన వారే మనుగడ సాగిస్తారన్నారు. ఖురాన్ గ్రంథంలోని అంశాలను వివరించారు. ఒకరినొకరు ఆప్యాయంగా కౌగిలించుకొని ఈద్ ముబారక్ అని చెప్పుకుంటూ పండుగను నిర్వహించుకున్నారు. మండలంలోని ముండ్లమూరు, పసుపుగల్లు, పులిపాడు, బసవపురం, శంకరాపురం, మారెళ్ళ, నాయుడుపాలెం, ఈదర, గ్రామాలలో ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీరి వీరి గా దానధర్మాలు చేశారు.

దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దళితులకు ఇవ్వాలి

కవలకుంట్ల గోవింద ప్రసాద్

విశాలాంధ్ర-దర్శి : దర్శి మార్కెట్ యార్డు 1977వ సంవత్సరంలో ఏర్పాటు చేయబడి నాటినుండి నేటి వరకు ఓసి కులాలకు చెందిన రెడ్డి. కమ్మ. కాపులతో పాటు వైశ్య. యాదవ, మైనార్టీ కులాలవారు చైర్మన్లా పని చేయడం జరిగింది. ఇప్పటివరకు ఒక ఎస్సీ కులానికి మాత్రమే ఏంసి పదవి ఇవ్వలేదు. ఇప్పటికైనా నియోజకవర్గంలో 50 వేలు చిలుకు ఓటర్లు ఉన్న ఎస్సీ కులానికి చెందిన వారికి దర్శి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్గా నియమించాలని నవ్యాంధ్ర మాదిగ చర్మకారులు డప్పు కళాకారుల పోరాట సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ఎస్సీలకు దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఇవ్వాలని దర్శి నియోజకవర్గం ఇంచార్జి గొట్టిపాటి లక్ష్మీ ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించాలని ఆలోచనలో ఉన్నట్లు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ తెలిపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలలోరాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి వినతిపత్రం సమర్పించి ఖచ్చితంగా దర్శి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా దళితులకు ఇవ్వాలని గట్టిగా కోరనున్నట్లు కవలకుంట్ల గోవింద ప్రసాద్ మాదిగ తెలిపారు.

వైష్ణవి పుట్టినరోజున అన్నదానం

విశాలాంధ్ర-ఒంగోలు : సమాజంలో ధనవంతులు దాతృత్వంతో పేదలను ఆదుకోవాలని సాటి వారికి సహాయపడే మానవీయత విలసిల్లిన నాడే మెరుగైన సమాజం ఏర్పడుతుందని ప్రముఖ పారిశ్రామికవేత్త మండవ మురళీకృష్ణ అన్నారు. సోమవారం దొంత శ్రీనివాస్ వనజ దంపతుల కుమార్తె వైష్ణవి జన్మదినోత్సవం సందర్భంగా ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివం శరణాలయంకు బియ్యం బస్తాలు నూనె కందిపప్పు తదితర నిత్యావసర వస్తువులు వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా శివం శరణాలయంకు అందజేశారు. ఒంగోలు కబాడీపాలెం చెందిన కనమోలు శారద వైద్య ఖర్చులకు పదివేల రూపాయలు వైష్ణవి తండ్రి శ్రీనివాస రావు ఏజే సొల్యూషన్ ప్రియా మేడం 5వేలు మొత్తం 15వేల రూపాయలు అందజేశారు. వంటకాలని చెందిన అంజమ్మ కుమార్తె మందులకు మరో మూడు వేలు శ్రీనివాస్ అందించి మానవత్వం చాటారు. శివం శరణాలయం వద్ద వృద్ధులకు పేదలకు అన్నదానం నిర్వహించారు. ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ.. పుట్టిన రోజున ఆడంబరాలకు పోకుండా ఇలా సమాజ సేవ చేయడం ఆదర్శనీయమన్నారు. ఆకలిగొన్నవారికి పట్టెడన్నం పెట్టి వారి కళ్ళల్లో ఆనందం చూడటం ఎనలేని సంతోషాన్ని కలిగిస్తోందని, సమాజంలో ప్రతి ఒక్కరూ సేవే పరమావధిగా జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, కోసూరి శ్రీదేవి, మండవ సుబ్బారావు, చౌదరి, చిక్కాల కిరణ్ కుమార్, వడ్డేంపూడి సుజాత, గాయని నాగేశ్వరమ్మ, కొల్ల మధు, రాయపాటి జగదీష్, లాయర్ సురేష్ మరియు వైష్ణవి కుటుంబ సభ్యులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలోని అనాథలకు యాచకులకు 300 మందికి పౌష్టిక ఆహారంతో కూడిన భోజనం పంపిణీ చేశారు.

పీర్ల మాన్యం కాలానికి ప్రత్యేక అభివృద్ధికి కృషి చేస్తా : ఎమ్మెల్యే బీఎన్

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ముస్లిమ్స్ అధిక సంఖ్యలో నివాసం ఉంటున్న పీర్లమాన్యం కాలనికి ప్రత్యేకంగా నిధులకేటాయించి అభివృద్ధి చేస్తానని సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ కుమార్ వెల్లడించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని మండలంలోని పేర్నమిట్ట పీర్ల మాన్యం కాలనీలో సోమవారం జరిగిన బక్రీద్ వేడుకల కార్య క్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి నేతలు ఏర్పాటు చేసిన కేకును ఎమ్మెల్యే విజయ్ కుమార్ కట్ చేసి అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం కోసం మరింతగా పాటుపడతామన్నారు, అనంతరం పీర్లమాన్యం టిడిపి నాయకులు ఎమ్మెల్యే విజయ్ కుమార్‌కు శాలువా కప్పి పూలమలవేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే విజయ్ కుమార్ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కందుకూరు వెంకటేశ్వరరావు (బాబు) మాజీ ఎంపీపీ వివరం గోవిందు మాజీ వైస్ ఎంపీపీ వాచేపల్లి వెంకటేశ్వర రెడ్డి టిడిపి జనసేన నాయకులు షేక్ కాలేషా షేక్ అమానుల్లా షేక్ మస్తాన్ పెసల శ్రీనివాసరావు కందుకూరు వాసు శ్రీనివాసరావు, మలగా వెంకట్రావు పాల్గొన్నారు.

మాగుంటను కలిసిన కర్నూల్ రోడ్డు వ్యాపారస్తులు

విశాలాంధ్ర-ఒంగోలు : కర్నూల్ రోడ్డు షాపు ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన మాగుంట శ్రీనివాసులురెడ్డిని మర్యాదపూర్వకంగా కర్నూల్ రోడ్డు వ్యాపారస్తులు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. ఒంగోలు నగరం అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు తెచ్చి సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు చే రెడ్డి లక్ష్మణ్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మారెళ్ళ సుబ్బారావు, కోశాధికారి ఉప్పం వెంకటేశ్వరరావు సభ్యులు కొల్లా మధు, దండు రెడ్డి అంజిరెడ్డి, కిరణ్ కుమార్, సాగర్, నైనాల వేణుగోపాల్, అడపా జనార్ధన్, వెరైటీ సప్లై శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్

విశాలాంధ్ర-పీసీపల్లి : త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ వేడుకలను మండలంలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం ఉదయం ఆయా ప్రాంతాల్లోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి సోదర భావంతో మెలగాలని ఆకాంక్షించారు. కరుణ సహనం ప్రదర్శిం చాలనే సందేశాన్ని మత గురువులు ఈద్గాల వద్ద బోధించారు. అనంతరం ముస్లింలు పరస్పరం పండుగ శుభాకాంక్షలను తెలుపుకున్నారు.

భూములు కౌలుకు బహిరంగ వేలం పాటలు

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని ఉన్న హనుమంతునిపాడు మండల పరిధిలోని ఉన్న చిన్న గొల్లపల్లి గ్రామములో వెలచి ఉన్న శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి మరియు ఆంజనేయస్వామి వారి దేవస్థానమునకు సంపూర్ణ హక్కు కలిగిన చిన్నగొల్లపల్లి, నల్లగండ్ల, పెద్దగొల్లపల్లి, వాలిచెర్ల, దొడ్డిచింతల గ్రామాలలోని భూములకు తేదీ: 20-06-2024 న గురువారం ఉదయం గం.10-30 నిలకు శ్రీ స్వామివారి దేవస్థానము ఆవరణలో మూడు సంవత్సరములకు అనగా 2024-2025 నుండి 2026-2027 వరకు భూములు కౌలుకు బహిరంగ వేలము పాటలు జరుగునని దేవాలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.శ్రీనివాస్ బాబు తెలియపరచడమైనది.

మోడల్ స్కూల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించిన 'ఉగ్ర'

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మోడల్ స్కూల్ రోడ్డును నిర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఉగ్ర ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో గార్లపేట రోడ్డు లో గల ఆదర్శ పాఠశాలకు వెళ్లే మట్టి రోడ్డును, పాఠశాలను సందర్శించారు.అధ్వానంగా ఉన్న మోడల్ స్కూల్ రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్ అండ్ బి అధికారులను పిలిపించి ఆదేశించారు. వర్షాలు వస్తే విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు ఇబ్బంది పడతారని ఈలోపు అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డును మెటల్ రోడ్డుగా నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఆదర్శ పాఠశాలను, వసతి గృహాన్ని పరిశీలించి పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సర్వ శిక్ష అభియాన్ అధికారులను సంప్రదించి ప్రతిపాదనలు తయారు చేయించాలని పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గోపిశెట్టి బాల చెన్నారావు కు సూచించారు. అనంతరం గార్లపేట రోడ్డు నుంచి శంఖవరం మీదుగా కందుకూరు ఉన్న రోడ్డును ఆయన పరిశీలించారు. శంకవరంలో గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతానని వారికి ఎమ్మెల్యే డాక్టర్ తెలియజేశారు. ఆయన వెంట తెలుగు యువత అధ్యక్షులు షేక్ ఫిరోజ్, నాయకులు తమ్మినేని వెంకట్ రెడ్డి, షేక్ అహ్మద్, షేక్ బారాయిమామ్, తమ్మినేని సురేంద్ర, శ్రీను, కొండలు, నాగ, ఆర్ అండ్ బి ఏఈ ఫిరోజ్ ఉన్నారు.

30 ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలి

ఏపీ టీచర్స్ గిల్డ్ వినతి

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలోని 30 ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు, సిహెచ్ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులు లేని మరియు పదిమందిలోపు విద్యార్థులు ఉన్న ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలను డైరెక్టర్ కార్యాలయానికి పంపి మిగులు ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు సర్దుబాటు చేయాలన్నారు. డిఎంబిసి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఎర్రగొండపాలెం 10 మంది,సెయింట్ థెరిసా ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాల ఒంగోలు 6 మంది, నల్ల గుంట ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాల కొమరోలు 3 మంది,ఎస్ పి జి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల గిద్దలూరు1 మంది, ఉమామహేశ్వర ప్రాథమిక పాఠశాల మానేపల్లి పుల్లలచెరువు మండలం4 మంది, శారద ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మార్కా పురం2 మంది,దొనకొండ ఇందిరా గాంధీ ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాల 3 మంది, ఏబీఎం ఉన్నత ఎయిడెడ్ పాఠశాల మార్కాపురం 6 మంది, ఏబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల కనిగిరి1 మంది, ఏబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఒంగోలు1, సమావేశం ఉన్నత ఎయిడెడ్ పాఠశాల ఒంగోలు2, హిందూ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఒంగోలు1, జివిఎస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఒంగోలు 8 మంది, వేలమూరిపాడు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల అద్దంకి1, ఆది ఆంధ్ర ఎయిడెడ్ పాఠశాల కొరిసపాడు1, ఆది ఆంధ్ర ప్రాథమిక ఎయిడెడ్ పాఠశాల కోనంకి1, పెద్దకొత్తపల్లి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మద్దిపాడు1, నికరంపల్లి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల మార్కాపురం 1,పిపి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల ఇడుపులపాడు ఇంకొల్లు మండలం 3 మంది, బోడపాడు ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల 3మార్కాపురం3 మంది ,పివిఎస్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల పోతవరం 2నాగులుప్పలపాడు మండలం2,ఎస్ ఎస్ ఆర్ ఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల అర్ధవీడు3 మంది,శ్రీ శ్రీనివాస ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కంభం6 మంది,సెయింట్ థెరీసా ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఒంగోలు 14 మంది, నల్ల గుంట ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కొమరోలు మండలం 1,శ్రీ వివేకానంద ఎయిడెడ్ ఉన్నత పాఠశాల గిద్దలూరు5, ఏబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల కొమరోలు 3 మంది, ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కొమరోలు 3 మంది, సిసి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల గిద్దలూరు 3, సిసి ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల గిద్దలూరు 3 మొత్తం 104 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులకు ప్రభుత్వం వెంటనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేయాలని గిల్డ్ జిల్లా నాయకులు కోరారు.

బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు

విశాలాంధ్ర-ఒంగోలు : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పును ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిగా కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. దీంతో పేదలు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఈనెల 12వతేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు.రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు ఇవ్వడం లేదన్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. సీఎం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు కదిలారు. రాష్ట్రస్థాయిలో కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపారు. ఈనెల 20వతేదీ నుంచి రేషన్ షాపులకు బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, పంచదారను సరఫరా చేయాల్సి ఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ ఆధికారులు శనివారం ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లో దించిన చెక్కర, కందిపప్పు నాణ్యతతో పాటు అక్కడికి వచ్చిన ప్యాకెట్లను తూకం వేసి పరిశీలించారు. వచ్చేనెల 1 నుంచి వీటిని పంపిణీ చేయనున్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ఎం.వి.సత్యనారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

పశ్చిమ ప్రకాశానికి మంచి రోజులు

ఎంపీ మాగుంట

విశాలాంధ్ర-మార్కాపురం : ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పశ్చిమ ప్రకాశం ప్రజల ఆశలు త్వరలో నెరవేరనున్నాయని అందులో భాగంగా నూతనంగా మార్కాపురం జిల్లా కేంద్రంగా ఏర్పాటు కానుందని ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాగుంట మాట్లాడుతూ మార్కాపురం జిల్లా కోసం ఈ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన కూడా చేశారని అయితే గత ప్రభుత్వం ఈ సమస్య గురించి పట్టించుకోలేదని అన్నారు. ఇటీవల ఎన్నికల సందర్భంగా చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే జిల్లా ఏర్పాటు చేస్తానన్న హామీ మేరకు మార్కాపురం జిల్లా కానుందని అన్నారు. అలాగే పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులు కూడా పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వం లోని ఎన్డీఏ కూటమికి రాష్ట్ర ప్రజలు గణనీయమైన మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేయడం జరిగింది.

ఎంపీ మాగుంటకు ఘన స్వాగతం :

పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికైన తొలిసారిగా మార్కాపురం వచ్చిన మాగుంట శ్రీనివాసరెడ్డికి సోమవారం సాయంత్రం స్థానిక బైపాస్ రోడ్డు వద్ద టీడీపీ నాయకులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాగుంటకు స్వాగతం పలికిన వారిలో నియోజకవర్గ టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, టీడీపీ వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు డీవీ కృష్ణారెడ్డి, కాకర్ల శ్రీనివాసులు, రాక్‌వెల్ పబ్లిక్‌స్కూల్ అధినేత వెన్నా పోలిరెడ్డి, ఆయన తనయులు వెన్నా నాగార్జునరెడ్డి, వెన్నా నరేంద్రరెడ్డిలు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పార్టీ కార్యకర్తలు మాగుంటను భారీ ర్యాలీగా ఎంపీ కార్యాలయానికి తీసుకొచ్చారు.

అగమ్య గోచరంగా వాలంటీర్ల పరిస్థితి

వైసీపీ నాయకుల ఒత్తిళ్ళ మేరకే రాజీనామా చేశామంటున్న వాలంటీర్లు

విధుల్లోకి తీసుకోవాలంటూ అభ్యర్థన

వాలంటీర్లు వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కసరత్తు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఏపీలో కొత్త ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. జగన్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాల ప్రక్షాళన ప్రారంభించింది. వాలంటీర్ల వ్యవస్థలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపైన ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. వాలంటీర్లను కొనసాగిస్తామని రూ.10వేల వేతనం చెల్లిస్తామని గతంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. తాజాగా టీడీపీ ఎమ్మెల్యేలను కలిసిన వాలంటీర్లు తమను విధుల్లో కొనసాగించాలని వైసీపీ నాయకుల ఒత్తిళ్ళ మేరకే రాజీనామా చేశామంటు వాలంటీర్లు కోరుతున్నారు. వైసీపీ కోసం వాలంటీర్లు పని చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల సమయంలో పెన్షన్ల పంపిణీ నుంచి ఎన్నికల సంఘం వాలంటీర్లను పక్కన పెట్టింది. ఆ సమయంలో పలువురు వాలంటీర్లు తమ విధులకు రాజీనామా చేసి వైసీపీకి మద్దతుగా నిలిచారు. రాజీనామాలు చేసినవారంతా తిరిగి విధుల్లో చేరతామంటూ టీడీపీ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలిస్తున్నారు. వైసీపీ నేతలు బలవంతంగా తమతో రాజీనామాలు చేయించారని, తమని క్షమించాలని వేడుకుంటున్నారు. చంద్రబాబు వాలంటీర్ల వ్యవస్థ కొనసాగింపు పైన కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాలంటీర్లకు కనీస విద్యార్హతను నిర్ణయించి విధుల్లో కొనసాగించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో రాజీనామాలు చేసిన వాలంటీర్లకు తిరిగి అవకాశం ఇస్తారా లేదా అనేది కీలకంగా మారుతోంది. నాడు వైసీపీ కోసం రాజీనామా చేసిన వారు ఇప్పుడు తిరిగి విధుల్లో చేరేందుకు ముందుకు వస్తున్నారు. వీరి విషయంలో చంద్రబాబు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అదే విధంగా వాలంటీర్లను గత ప్రభుత్వం పథకాల అమలు కోసం ప్రధానంగా వినియోగించుకుంది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం వీరి సేవలను పరిమితం చేసే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం వాలంటీర్లు స్వయంగా సేవలు అందించే అవకాశం ఇవ్వాలని, తమ రాజీనామాలు వెనక్కు తీసుకుంటా మని చెబుతున్నారు. దీంతో టీడీపీ నేతలు ఈ అంశాన్ని పార్టీ నాయకత్వానికి నివేదిస్తున్నారు. వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ కొనసాగించాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సచివాలయ వ్యవస్థ నిర్వహణ బాధ్యతలను వాలంటీర్లు వ్యవస్థ భాధ్యతలను మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామికి కేటాయించారు. ఇక ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థ కొనసాగింపు ఖాయంగా కనిపిస్తోంది. అయితే రాజీనామా చేసిన వారి విషయంలో నిర్ణయం ఏంటనేది స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన వస్తుందో అని రాజీనామా చేసిన వాలంటీర్లు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

ఆటలతో పాటు చదువులోనూ రాణించాలి

విశాలాంధ్ర - చీరాల : క్రీడలు మనసికోల్లాసానికి దోహదం చేస్తాయని, విద్యార్థులు ఆటలోనూ చదువులోనూ ఉన్నతంగా రాణించాలని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. సోమవారం ఎమ్మెల్యే నివాసంలో ఒరిస్సా రాష్ట్రం కటక్ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగే నేషనల్ తైక్వాండో పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున ఎంపికైన హంటర్స్ తైక్వాండో విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య మాట్లాడుతూ రాష్ట్రం తరపున ఎన్నికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈనెల 28, 29, 30 తేదీలలో జరిగే దేశ స్థాయి పోటీలలో తప్పకుండా మెడల్స్ సాధించాలని, విద్యార్థులకు ఉన్నత స్థాయి తర్ఫీదు ఇచ్చి దేశస్థాయి క్రీడాకారులుగా తయారు చేసిన కోచ్ గూడూరు శాంతి వరప్రసాదిని ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కోచ్ గూడూరు శాంతి వరప్రసాద్ మాట్లాడుతూ పెద్దల ప్రోత్సాహం ఆశీస్సులు ఉంటే తప్పకుండా నేషనల్ మెడల్ సాధిస్తామని, మాకు ఇంతటి ప్రోత్సాహాన్ని ఇచ్చిన ఎమ్మెల్యే కొండయ్యకి టైక్వాండో ట్రైనింగ్ స్కూల్ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సెలెక్ట్ అయిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : వైకల్యంగల విద్యార్థుల కొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బూదాటి సుధాకరరావు ప్రత్యేక అవసరాలు కలిగిన తల్లి దండ్రులకు సూచించారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక సత్రంబడి నందు భవిత కేంద్రంలో సోమవారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులకు అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో సుధాకరరావు మాట్లాడుతూ వైకల్యం కలిగిన విద్యార్థుల కొరకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పించి శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిత కేంద్రాలకు రాలేని పిల్లలకు ప్రతి శనివారం ఇంటి వద్దనే విద్యను అందించడం, ఉచితంగా ఫిజియో థెరపీ సేవలు అందించడం జరుగుతుంద న్నారు. వైకల్యం కారణంగా ఏ పిల్లవాడు బడి మానేయకుండా ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బొమ్మనం పాడు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల తల్లి దండ్రులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్ విషయంలో ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ.ఆర్.టి ఉపాధ్యాయులు కొంగల శ్రీని వాసరావు, పాలపర్తి యోనా, సిఆర్‌పి గుర వయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ పెంపుపై హర్షం

విశాలాంధ్ర - రేపల్లె : దివ్యాంగుల పెన్షన్లు రూ.4000 నుండి 6000లకు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం బాధ్యతలు స్వీకరించిన వెంటనే సంతకాలు చేసి దివ్యాంగులకు పెన్షన్ పెంచుతూ తీసుకున్న నిర్ణయం పట్ల అరుణశ్రీ వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, రెవిన్యూమంత్రి అనగాని సత్య ప్రసాద్ చిత్రపటాలకు సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి సంఘం తరపున నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అరుణశ్రీ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జానం మురళీకృష్ణ అన్నారు. ఈ కార్యక్రమంలో మేక ఉమామహే శ్వరరావు, మేక రామకృష్ణ, ఖాదర్ వలీ, ఎస్.పాములు, సాయిబాబు, రంగారావు, గౌతమ బుద్ధ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అద్దంకి : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గంలో విద్యుత్ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను అద్దంకి డివిజన్‌లో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఫోటోగ్రాఫర్స్ నూతన అసోసియేషన్ ఏర్పాటు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : స్థానిక టౌన్ హాల్‌లో బాపట్ల మండలంలోని ఫోటోగ్రాఫర్స్ నూతనంగా అసోసియేషన్ ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఫోటోగ్రాఫర్స్‌తో పాటు చుట్టుప్రక్కల గ్రామాలలో ఉన్న ఫోటోగ్రాఫర్స్‌ను కూడా సభ్యులుగా చేర్చుకోవటం జరిగింది. భావపురి ఫోటోగ్రాఫర్స్ ట్రేడ్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా నిర్ణయించటం జరిగిందన్నారు. అనంతరం కమిటిని ఎన్నుకోవటం జరిగిందన్నారు. ఈ అసోసియేషన్ కమిటీలో గౌర అధ్యక్షులుగా వాహిని ప్రసాద్, పి.వి.యస్ నాగరాజు, అధ్యక్షులుగా కే.సిద్దార్ధ రెడ్డి, ఉపాధ్యక్షులు ఆదిశేషు, కార్యదర్శి యస్.కే జాని, సహాయ కార్యదర్శి డి.నాగేశ్వరావు, కోశాధికారి యన్.శ్రీనివాసరావులను ఎన్నుకోవటం జరిగిందన్నారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కరణం

విశాలాంధ్ర - చీరాల : బక్రీద్ పండుగ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కరణం వెంకటేష్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు, సోదర భావంతో మెలగాలన్నారు. పాడి పంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. మోకాలి చికిత్స సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు దూరంగా ఉండాల్సి వచ్చిందని త్వరలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని కరణం వెంకటేష్ తెలిపారు.

త్యాగ నిరతిని వ్యాపింపచేయుటమే బక్రీద్

విశాలాంధ్ర - పర్చూరు : ఖురాన్ ప్రవచనాల ప్రకారం ఇబ్రహీం వలే స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవులలో ఉన్న త్యాగ నిరతిని వ్యాపింపచేయుటమే బక్రీద్ ఉద్దేశమని ఇస్లాం మత ఇమామ్ బోధించారు. స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఇమామ్ మాట్లాడుతూ అన్ని గుణాలలో దానగుణం ఉత్తమమని తెలిపారు. ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారాన్ని అందిస్తారని తెలిపారు. ముస్లింలు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రార్థనలో పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి లోకేష్‌కి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ బాబు వినతి

విశాలాంధ్ర - తాడేపల్లి : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు వేతనాలు పెంపుదల చేయాలని, విద్యార్థి మెస్‌చార్జీలు పెంచాలని, అర్థాంతరంగా తొలగించే విధానాన్ని అరికట్టి ప్రభుత్వ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, స్కూల్స్ స్కావెంజర్స్‌కు వేత నాలు పెంచాలని, మోడల్ స్కూల్ హాస్టల్ సిబ్బం ది రెగ్యులర్ చేయాలని, పార్ట్ టైం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం తాడేపల్లి ఉండవల్లిలోని ప్రజాదర్బార్ కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 86,500 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన పేద మహిళలు మధ్యాహ్న భోజన పథకంలో గత 20 సంవత్సరాలు నుండి పని చేస్తున్నారని వారికి వేతనాలు పెంచడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని వారి శ్రమను దోచుకుందని ఆరోపించారు. ఎన్నో సార్లు ఆందోళనలు చేసిన ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 134 ఆదర్శ పాఠశాల వసతి గృహాల్లో పనిచేస్తున్న దాదాపు 1200 మంది ఔట్సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, వారికి వేతనాలు పెంచాలని, మహిళా కార్మికులకు 24/7 గంటల పని విధానాన్ని తొలగించి, ఎనిమిది గంటల పని విధానం అమలు చేయాలని, హాస్టల్ సిబ్బంది సంఖ్యను పెంచాలని, మినిమం టైం స్కేల్ వర్తింపజేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి ద్వారా కోరారు. ఈ సందర్భంగా నారా లోకేష్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

మోడీ పాలన భారతదేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్

విశాలాంధ్ర - గుంటూరు వైద్యం : మోదీ పాలన వల్ల ఆంధ్రప్రదేశ్-తెలంగాణా రాష్ట్రాలకు పెను ప్రమాదమని, భారతదేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్‌పీసీ)వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో విమర్శిం చారు. రెండు తెలుగు రాష్ట్రాలలో గల సంపదను దోచుకోవటానికే మోదీ సర్కార్ దృష్టి సారిస్తుం దని, కార్పొరేట్లకు, గుజరాతీయులకు ఆంధ్రప్ర దేశ్, తెలంగాణా సంపదను, మేధస్సును దోచి పెట్టాదానికే మోదీ సర్కార్ నిరంతరం పని చేస్తుం దని ఆరోపించారు. ఈ దేశం నుంచి మోడీని భారతీయులు సాగనంపకపోతే భారత్‌కు అత్యంత ప్రమాదం పొంచి ఉంటుందన్న విషయాన్ని భారతీయులు గ్రహించి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులను ప్రోత్సహించాలని కోరారు.

జగన్ ఇంటి వద్ద ఆంక్షలు తొలగింపు

విశాలాంధ్ర-తాడేపల్లి: తాడేపల్లిలో మాజీ ముఖ్య మంత్రి, వైసీపీ అధినేత జగన్ ఇంటి వద్ద గతంలో రోడ్డుకు అడ్డుగా ఏర్పాటు చేసిన బారికేడ్లను, పోలీసు చెక్‌పోస్టులను అధికా రులు తొలగించారు. దీంతో దుగ్గిరాల మండలం రేవేంద్ర పాడు, తదితర ప్రాంతాలకు వెళ్లడానికి ప్రజలకు దారి కష్టాలు తప్పాయి. జగన్ ముఖ్యమంత్రి కాగానే తాడేపల్లిలో ఆయన నివాసం వెనుక రోడ్డును మూసేశారు. అంతేకాకుండా అడ్డంగా బారికేడ్లు, పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగన్ నివాసం వద్ద రోడ్డుకు అడ్డుగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో సీతానగరం నుంచి రేవేంద్రపాడు, దుగ్గి రాల, తెనాలి వైపు వెళ్లడానికి ప్రజలకు దారి లేకుండా పోయింది. దీంతో ప్రజలు ఒకటిన్నర కిలోమీటర్లు దూరం అదనంగా వెళ్లాల్సి వచ్చేది. జగన్ నివాసం వెనుక నాలుగు లైన్ల రహదారితో పాటు పక్కనే కాలువపై ఉన్న రహదారిలో సైతం జనం రాకపో కలను అనుమతించలేదు. దీనివల్ల తాడేపల్లి నుంచి కుంచనపల్లి, వడ్డేశ్వరం, గుండిమెడ, మెల్లెంపూడి, రేవేంద్రపాడు వెళ్లేవారం దరూ చుట్టూ తిరిగి వెళు తున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో ప్రజలు విన్నవించారు. ఇప్పటికైనా జగన్ నివాసం వెనుక ఉన్న రోడ్డులో రాకపోకలకు అనుమతించాలని అభ్యర్థించారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు జగన్ నివాసం వెనుక రోడ్డులో బారికేడ్లను తొలగించారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు : మంత్రి

విశాలాంధ్ర-మంగళగిరి: జనసేన పార్టీ విజయం కోసం అంకితభావంతో కష్టపడి పని చేసిన నాయకులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాజకీయ వ్యవహాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తనను కలిసిన నాయకులకు హామీ ఇచ్చారు. తెనాలిలో ఘనవిజయం సాధించి రాష్ట్ర పౌరసరఫరాల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నాదెండ్ల మనోహర్‌ను జన సేన నాయకులు కంకణాల శంకర్ సోమవారం కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. దీనిపై నాదెండ్ల మనోహర్ స్పందిస్తూ పార్టీకోసం పనిచేసిన అందరినీ గుర్తించి, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతా మన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇచ్చే నామినేటెడ్ పదవుల్లో వీరికి ప్రాధాన్యత ఇవ్వాలని అధ్యక్షుల వారిని కోరుతానన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలసి సత్కరించిన వారిలో జనసేన నాయకులు తేజ, కంకణాల హనుమంతరావు, చెన్నం వీరాంజనేయులు, బూసం రామారావు తదితరులు ఉన్నారు.

'ప్రజాదర్బార్'లో వినతుల వెల్లువ

విశాలాంధ్ర-తాడేపల్లి: మంగళగిరి ప్రజల కోసం మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న "ప్రజాదర్బార్" కు అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు ఉండవల్లిలోని నివాసానికి చేరుకుని నారా లోకేష్‌కు తమ సమస్యలు విన్నవించుకుంటున్నారు. ఉదయం 7 గంటల ప్రాంతానికే వందలాదిమంది ప్రజలు వినతిపత్రాలతో ఇంటివద్ద బారులు తీరుతున్నారు. మంగళగిరి ప్రజలను తమ కుటుంబసభ్యులుగా భావించే లోకేష్ ప్రతిఒక్కరి సమస్యను వింటూ నేనున్నానని భరోసా ఇస్తున్నారు. సోమవారం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజలు తమ సమస్యలపై యువనేతను కలిసి తాము ఎదుర్కొం టున్న కష్టాలను తీర్చాలని విజ్ఞప్తి చేశారు. జీతాలు పెంచాలని అంగన్వాడీ టీచర్లు, బదిలీల కోసం ఉపాధ్యాయులు, ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలని నిరుద్యోగుల నుంచి వినతులు అందాయి. అందరి సమస్యలను ఓపిగ్గా విన్న లోకేష్ సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపుతానంటూ భరోసా ఇవ్వడంతో మంగళగిరి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనగాని శివప్రసాద్‌కు సన్మానం

విశాలాంధ్ర - రేపల్లె : ముస్లిం సోదరుల పవిత్ర పండుగ త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం రేపల్లె పట్టణంలోని ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ బక్రీద్ వేడుకలలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్, తెలుగుదేశం నాయకులు తాతా ఏడుకొండలు, పంతాని సాయి కుమార్, కేసన రామకృష్ణ, డొక్కు బుజ్జి, జమీర్, ఖాదర్ ఖాన్, ఎస్కే వలి, అమీర్ భాష, పాల్గొని ఈ కార్యక్రమంలో శివప్రసాద్‌ను దుశాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు.

ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సమతా,మమతల సమ్మిళితాన్ని చాటి చెప్పే బక్రీద్ పర్వదిన సందర్భంగా నియోజకవర్గ ముస్లిం సోదరులకు మాజీ మున్సిపల్ చైర్మన్ నరాల శెట్టి ప్రకాశరావు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా నిలిచిన ఈ వేడుకను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సన్మార్గంలో నడిపించే పవిత్ర ఖురాన్ అందించిన సూత్రాలు ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరుతూ మహత్తరమైన త్యాగం నుండి ఆవిష్కృతమైన బక్రీద్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

విశాలాంధ్ర - చీరాల : రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పైన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చీరాల ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో నివాసం ఉంటున్న ఓ యువకుడు బైక్ పై ప్రయాణిస్తూ రైల్వే బ్రిడ్జి రోడ్డుపైన బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంకు సమాచారం అందించారు. దీంతో చికిత్స నిమిత్తం ఆ యువకుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆ యువకుడు పరిస్థితి విషమంగా ఉంది. అయితే ప్రమాదానికి గురైన యువకుడికి సంబంధించిన బంధువులు ఎవరు అందుబాటులోకి రాలేదు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో బైక్‌ను నడపడంతో ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేరు ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఆరా తీస్తున్నారు.

చేపల వేటకు వేళాయే

విశాలాంధ్ర - నిజాంపట్నం : సముద్రంలో చేపల వేట విరామానంతరం బోట్లు సముద్రంలోకి వేటకు వెళ్లేందుకు సిద్ధమయ్యాయి. ప్రతి ఏడాది సముద్రంలో చేపల వేట చేసే మత్స్యకారులకు వేట విరామ సమయం ఉంటుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మత్స్య సంపద వేటను ప్రభుత్వం నిషేధిస్తుంది. ఆ కారణంగా సముద్రంలో మత్స్యకారులు మత్స్య సంపదను వేట చేయరు. వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా సముద్రంలో వేట ఇబ్బందికరంగా మారుతుంది. అదే సమయంలో మత్స్య సంపద సంతానోత్పత్తి, పునరుత్పత్తి అవుతుంది. దీంతో మత్స్య సంపదను కాపాడేందుకు ప్రభుత్వం వేట నిషేధం విధిస్తుంది. ఈ వేట నిషేధ సమయంలో బోట్లు మరమ్మతులు పనులు చేయించడంలో బోటు యజమానులు నిమగ్నమై ఉంటారు. అనంతరం బోట్లు సరిగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత వేట నిషేధం తొలిగిన వెంటనే మంచి శుభ ముహూర్తాలు చూసుకొని వేటకు పంపేందుకు సిద్ధమవుతారు. ఈనెల 14తో వేట నిషేధం తొలగడంతో బోటు ఓనర్లు అందరూ సమావేశమై మంచి రోజును నిర్ణయించుకొని గ్రామ దేవత మొగధారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి 17వ తేదీ సోమవారం ఉదయం తమ బోటులను సముద్రంలో వేటకు పంపించారు. దింతో నిజాంపట్నం హార్బర్ వద్ద బోట్లను పంపేందుకు బోటు యజమానులు, తదితరులు జట్టీ వద్దకు చేరుకుని తమ బోట్లు సముద్రంలోకి వెళ్లేంత వరకు వేచి చూసి ఆనందం వ్యక్తం చేశారు.

సమరసత సేవా ఫౌండేషన్ ఇంటింటి ధర్మ ప్రచారం

విశాలాంధ్ర - రేపల్లె : సమరసత సేవా ఫౌండేషన్ ఈనెల 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటి ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఐలవరంలో ఇంటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి స్టిక్కర్ అంటించి ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ జూన్ 10వ తేదీ నుండి 25వ తేదీ వరకు నగరాలలో మండల కేంద్రాలలో గ్రామాలలో ఇంటింటి ధర్మ ప్రచార నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ధార్మిక సమితులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండల సహ కన్వీనర్ వామనపల్లి కోటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ మాచర్ల రంగారావు, నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కొసనం భాస్కర వెంకటరమణ, గుద్దంటి జగన్మోహనరావు, ధర్మ ప్రచారక్ చింతల మురళీకృష్ణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

విశాలాంధ్ర - అద్దంకి : ముస్లిం సోదరుల పవిత్ర పండుగ బక్రీద్‌ను పురస్కరించుకొని సోమవారం మండలంలోని ముస్లిం సోదరులు ఆయా గ్రామాలలోని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆ లింగం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

మార్టూరులో :

త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ ప్రత్యేక ప్రార్ధనలు మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లిం సోదరులు ఈద్గా వద్ద సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.సోమవారం ఉదయం ముస్లిం సోదరులు తల స్నానం చేసి కొత్త బట్టలు ధరించి మసీదుల వద్ద నుండి బయలుదేరి ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకున్నారు.అనంతరం మత గురువు బక్రీద్ ఆవశ్యకత గురించి వివరించి అందరూ బాగుండాలని అందరి జీవితాల్లో శుభాలు శాంతి విరిసిల్లాలని అల్లాను వేడుకున్నారు.అనంతరం ఒకరినొకరు ఆ లింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.తరువాత ఇళ్ల వద్ద పొట్టేళ్లకు కుర్బానీ ఇచ్చి బంధువులకు పేదలకు మాంసం పంచి పెడతారు.

యద్దనపూడిలో :

ముస్లిం సోదరులు బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. పవిత్ర పండుగ త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలోని యద్దనపూడి, అనంతవరం గన్నవరం, పూనూరు, జాగర్లమూడి, పోలూరు తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక నమాజ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ బక్రీద్ వేడుకలలో తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లపునేని రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వరరావు, గుదే తారకరామారావు, కొరిటాల వంశీకృష్ణ, కోయ సతీష్, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, కొండల రాయుడు, సతీష్ తదితరులు పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

బల్లికురవలో :

మండలంలో బక్రీద్ పర్వదిన వేడుకలు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు నిర్వహించారు. ధార్మికత, శ్రద్ధా, నిష్టలతో ముస్లిం ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ యొక్క ప్రాముఖ్యతను, అల్లాహ్ యొక్క అనుగ్రహాన్ని ఏవిధమైన శ్రద్ధ, నిష్టలతో పొందవచ్చో వివరించారు. బల్లికురవ తోపాటు కొణిదెన, వల్లాపల్లి, గుంటుపల్లి, చెన్నుపల్లి, ముక్తేశ్వరం, కొప్పెరపాడు, ఉప్పుమాగులూరు, వేమవరం, కె.రాజుపాలెం గ్రామాలలో సూర్యోదయానికి ముందే ముస్లిం సోదరులు మసీదులలో అల్లా హ్ అనుగ్రహం కోరుతూ ప్రార్ధనలు చేస్తూ పులకించిపోయారు. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు పరస్పరం బక్రీదు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నిజాంపట్నంలో :

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పవిత్ర బక్రీద్ పండుగ వేడుకలను సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. నిజాంపట్నం మండల పరిధిలోని నిజాంపట్నం, దర్వేష్ పాలెం, ఎక్స్ మిలట్రీ కాలనీ, బావాజీపాలెం, కోమరపోలు, అడవులదీవి తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక నమాజ్ ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులు నూతన వస్త్రాలు ధరించి ఉదయాన్నే ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక నమాజ్ ప్రార్ధనలు నిర్వహించారు.త్యాగానికి ప్రతీకంగా నిలిచే బక్రీద్ పండుగ విశిష్టతను ముస్లీం మతపెద్దలు, హాఫీజ్ సబ్‌లు సందేశమిచ్చారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.స్తోమతకు తగ్గట్టు పేదలకు డబ్బులు, వస్త్రాలు ధానం చేసి మానవత్వం చాటుకున్నారు.అనంతరం ఇళ్లవద్ద పొట్టేళ్లను ఖుర్బాని చేసి పేదలకు పంపిణీ చేశారు.కులమతాలకు అతీతంగా స్నేహితులు, శ్రేయోభిలాషులు, పలువురు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

పిట్టలవానిపాలెంలో :

ఈద్-అల్-అదా పవిత్ర బక్రీద్ పండుగ పర్వదినం వేడుకలను సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలోని చందోలు, నడిముల్లపాలెం ఈద్గాల వద్ద ముస్లీం సోదరులు ప్రత్యేక నమాజ్ ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శు భాకాంక్షలు తెలుపుకున్నారు. అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ.. త్యాగాలకు మారు పేరుగా తాము బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటున్నామని ముస్లీం సోదరులు తెలిపారు.అనంతరం ఇళ్ళ వద్ద పొట్టేళ్లను ఖుర్బానీ చేసి పేదలకు పంపిణీ చేశారు.

సంతనూతలపాడులో :

మండలంలోని మైనంపాడు సంతనూతలపాడు గురువారెడ్డిపాలెం రుద్రవరం పేర్నమిట్ట గుమ్మళ్ళం పాడు తక్కెళ్ళపాడు మద్దులూరు గ్రామంలో ముస్లింస్ ఆధ్వర్యంలో సోమవారం బక్రీద్ పండగ పూర్వదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో బక్రీద్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు ముస్లిం సోదరులు చిన్న పెద్ద అనేతేడా లేకుండాఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అనంతరం ముస్లిం సోదరులు ఒంగోలు బిఎన్ విజయకుమార్ తన కార్యాలయంలో నందు సోమవారం బక్రీద్ పండగను పురస్కరించుకొని సంతమాతలపాడు ముస్లిం సంఘ నాయకులఆధ్వర్యంలో సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్చం అందజేసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోముస్లిం సంఘ నాయకులు ఎస్ కె రసూల్ నాయబ్ ఎస్ కె మునీర్ ట్రాన్స్కో లైన్ మాన్ ఎస్‌కే వహాబ్ పి నాగూర్ వలి ఎస్ కే నజీర్ ఎస్‌కె సైదా మోటార్ సైకిల్ మెకానిక్ కాలేషావలి ఎస్ కే రఫీ ఎస్ కే పకూరు ఎస్ కే కాలేషా వలి తదితరులు

కొమరోలులో :

త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగలను కొమరోలు మండలంలోని అల్లినగరం రెడ్డి చర్ల రాజుపాలెం నల్లగుంట్ల గుండ్రెడ్డి పల్లె పలు గ్రామాలలో బక్రీద్ పండుగను ఘనంగా ముస్లిం సోదరులందరూ జరుపుకొన్నారు. సోమవారం ఉదయం ఆయా ప్రాంతాలలోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి ప్రతి ఒక్కరూ సోదర భావాలతో మెలగాలని ఆకాంక్షించారు. బక్రీద్ పండుగ ప్రాముఖ్యతను హజరత్ ఇమామ్ మొహమ్మద్ ఉహి హజ్ ప్రాముఖ్యతను వివరించారు. తోటి వారి పట్ల కరుణ దయ సహనం పాటించాలని సందేశాన్ని మత గురువులు ఈద్గాల దగ్గర బోధించారు. అనంతరం ముస్లిం సోదరులందరూ పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

గొట్టిపాటి, ప్రత్తిపాటిలను కలసిన ఏపీయూడబ్ల్యూజే నేతలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ని చిలకలూరిపేటలో ఆయన నివాసంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు చెన్నుపాటి రాంబాబు, ప్రధాన కార్యదర్శి గొర్ల శ్రీనివాస రావు అసోసియేషన్ సభ్యులుతో కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ మంత్రి చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుని కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు నేతలు జర్నలిస్టుల కోసం ప్రభుత్వం పరంగా అందలిసిన అన్నిటిని వచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐజేయు కౌన్సిల్ మెంబర్ ఘట్టమనేని సురేష్, ఉపాధ్యక్షులు ధర్మవరపు దుర్గాప్రసాద్, కోశాధికారి మందాడి నరసింహారావు, సిహెచ్ శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు బి.కృష్ణారెడ్డి, గణేష్, రెడ్డి సుబ్బారావు,కంచర్ల సుబ్బారావు, మొగిలి సుబ్బారావు, షేక్ నాగూర్‌వలి, బాలాంజనేయులు, వెంగళ రెడ్డి, ఖాదర్ మస్తాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పోలీసుల గౌరవ వందనం

విశాలాంధ్ర - అద్దంకి : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం చిలకలూరిపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పోలీసులు బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర - రేపల్లె : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు రేపల్లె పట్టణంలో ఏటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా, ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా కట్టుదిట్టమైన శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా మసీదులు, ఈద్గాల వద్ద పోలీస్ అధికారులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ నజీర్ బేగ్ మాట్లాడుతూ సర్వమత సమ్మేళనమైన మన భారతదేశంలో ప్రతీ ఒక్కరు ఇతరుల మనోభావాలను, ఆచార వ్యవహారాలను గౌరవించుకోవాలన్నారు. పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా ముందు నుంచే పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ముస్లిం సోదర సోదరీమణులు బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రశాంతమైన వాతావరణంలో ప్రార్థనలు నిర్వహించుకునే విధంగా తగిన చర్యలు తీసుకున్నామన్నారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో

20 ఏళ్లు వెనుక్కి ఉమ్మడి ప్రకాశం జిల్లా

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర - అద్దంకి : వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అన్ని రంగాలలో వెనుకబడి పోయిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో వరుసగా 5వ సారి విజయదుందుభి మోగించిన గొట్టిపాటి రవికుమార్ సోమవారం పంగులూరు మండలం ముప్పవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ మంత్రికి నియోజకవర్గ నలుమూలల నుండి కార్యకర్తలు, నాయకులు అభినందనలు తెలియజేశారు. విద్యుత్ శాఖ ఉద్యోగులు పలువురు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల వైసీపీ పరిపాలనలో ఉమ్మడి ప్రకాశం జిల్లా అభివృద్ధికి నోచుకోలేక పోయిందని, గుండ్లకమ్మ జలాశయానికి గేట్లు నిర్మించకుండా లక్షలాది ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందకుండా ముఖ్యంగా 2వేల జాలర్ల కుటుంబాలు వీధిన పడ్డాయని తెలిపారు. జిల్లాలో ఉన్న వెలిగొండ, యర్రం చిన్న పోలిరెడ్డి, భవనాసి రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ట్రూ అప్, సర్‌చార్జీ, ఫిక్సిడ్ చార్జీల పేరిట గత ప్రభుత్వం 9 సార్లు సామాన్యుడిపై మోయలేని భారం మోపి విద్యుత్ రంగాన్ని నాశనం చేసి రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో రైతులు విద్యుత్ కోసం సబ్ స్టేషన్లు ముట్టడించి రోడ్లపై ధర్నాలు చేశారని, కానీ ఇప్పుడు మన ప్రభుత్వంలో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణయుగం కానుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

ఏఐటీయూసీ నియోజకవర్గ స్థాయి సమావేశం

చీరాల నియోజక వర్గ కార్యదర్శిగా బాసి పైడయ్య ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర - చీరాల : నూతన ప్రభుత్వం కార్మికులను కాపాడుకోవాలని, కార్మికులను ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వం మనుగడ సాగించ లేదని గత ప్రభుత్వంలో అసంఘటిత కార్మికులను వేదించినందుకు ప్రజలు ప్రజా క్షేత్రంలో బుద్ధి చెప్పారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. సోమవారం చీరాల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏఐటీయూసీ చీరాల నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు, బత్తుల శామ్యూల్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలుమాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ప్రజలు నేటి తెలుగుదేశం ప్రభుత్వానికి ఎంతో బాధ్యతతో కూడిన అధికారాన్ని అప్పజెప్పారని అన్నారు.

గత ప్రభుత్వంలో ఉద్యోగం వస్తె ఈ ప్రభుత్వంలో తొలగించే విధానాలకు స్వస్తి పలికి ప్రజారంజకగా పాలన అందించాలని కోరారు. కేంద్రంలో క్రియాశీలకంగా ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెచ్చేందుకు కృషి చెయ్యాలని అన్నారు. అంగన్ వాడిలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ పాఠశాలల ఆయాలతో పాటు స్కీమ్ వర్కర్ల అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసి ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న 35 వేల కేసులను పరిష్కారం చెయ్యకుండా వదిలేసిందని, సంక్షేమ బోర్డులో ఉన్న 600 కోట్లు వాడుకున్న దృష్ట్యా వెంటనే నూతన ప్రభుత్వం ఆ డబ్బును కార్మిక సంక్షేమ బోర్డుకు తిరిగి చెల్లించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఏఐటియుసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతాని బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చీరాల నియోజకవర్గ ఏఐటీయూసీ కార్యదర్శిగా బాసి పైడయ్యను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఏఐటీయూసీ కార్యదర్శి బాసి పైడయ్య మాట్లాడు తూ చీరాల నియోజక వర్గంలో వున్న కార్మిక ప్రజా సంఘాలను కలుపుకొని కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా పోరాటాల చేస్తానని చీరాలలో ఏఐటీయూసీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు శ్రీమన్నారాయణ, ఏపీ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కోటి దాసు, ఏఐబిఈఏ నాయకులు జి బ్రహ్మయ్య, ఏఐటీయూసీ కోశాధికారి రామేశ్వరం కుమార్, కమిటీ సభ్యులు సురదా శాంతి, ఎన్ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కొండయ్య

విశాలాంధ్ర - చీరాల : ముస్లిం సోదరులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అన్నారు. సోమవారం బక్రీద్ పర్వదిన సందర్భంగా చీరాల నవాబ్ పేటలోని ఈద్గా ప్రార్థనా మందిరంలో మాలకొండయ్య ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ తనను అఖండ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు ప్రార్థన సమయంలో అసౌకర్యానికి గురవుతున్నామని, ఎండ తీవ్రత దృష్ట్యా టెంట్లు వేసుకోవాల్సి వస్తుందన్నారు. ప్రార్థన చేసుకునేందుకు అధిక వ్యయ ప్రయాసలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణమే స్పందించిన మాల కొండయ్య రూ. 25 వేల సహాయంను మత పెద్దలకు అందించి ఎన్నో సంవత్సరాలుగా ప్రార్థనలు చేసుకొంటూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముస్లిం సోదరులకు తాత్కాలిక సౌకర్యాలు కాకుండా పర్మినెంట్‌గా నీడ ఏర్పడేలా సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఐదేళ్లలో ముస్లిం సోదరులకు అండగా నిలచి షెడ్డు సౌకర్యంగా మంచి సాంకేతికతతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభా కాంక్షలు తెలిపారు.